


# కాగితం పడవలు



"ఆత్మ, అమరత్వం" సిద్ధాంతం గురించిచర్చిస్తూ సోక్రటీసు అంటాడు: "ఈ వేళ ఉదయం ఏం జరిగింది? నిన్న రాత్రి ఏమయింది? నిన్న ఉదయం ఏం జరిగింది? మొన్న ఏమయింది?, అటుమొన్న ఏమయింది? — ఇలా క్రమక్రమంగా జ్ఞాపకం తెచ్చుకుంటూ వెనక్కిపోతే పుట్టిననాటివరకూ అన్నీ జ్ఞాపకం తెచ్చుకోవచ్చు. మరికొంత ప్రయత్నిస్తే మనం పుట్టకముందు ఏమయింది? ఎక్కడుండేవాళ్లం? ఈ సంగతులూ జ్ఞప్తికితెచ్చుకోడానికి అవకాశం ఉంది." అని. సోక్రటీసు అన్నాడో లేదో గాని సోక్రటీసు అన్నా

డని చదివినట్లు జ్ఞాపకం. ఈ సిద్ధాంతం నిజమో అబద్ధమో తేల్చుకుందామని కాదుగాని మరి ఒకళ్ల సహాయంలేకుండా నా అంతట నేనే వెనకటి జీవితం స్మృతికి తెచ్చుకుందామని చేసిన ప్రయత్నాలన్నీ నా అయిదో ఏటి అనుభవాలను దాటి వెనుకకు వెళ్లడంతో నాకు సాయపడలేకపోయాయి.

ఇంతవరకు నేను నడిచివచ్చిన బ్రదుకుబాటలో ఇది ఫలానా ఊరు అని నా అంతట నేను గుర్తుపట్ట గలిగింది నెల్లూరు. అంతకుముందువే నాలుగైదు దృశ్యాలు జ్ఞాపకం ఉన్నాయి— ఉదాహరణకి, ఇంటి కప్పులోనుండి గాజుటద్దంగుండా లోపలికి వచ్చి పడుతున్న ఎండ వెలుగులో రెపరెపలాడే నీలి, ఎరుపు, పసుపు, ఆకుపచ్చ, తెలుపు, ఊదారంగు, ఉల్లిపొర కాగితాలు ఎవళ్లో పురికొసతో తోరణాలు కడుతూ ఉండడమూ, నేను నోటిలో వేలువేసుకొని పెద్ద కావిడిపెట్టెమీద పడుకొనిఉండడమూ, — ఆకుపచ్చ ఆటేను బిళ్లల్లా ఉన్న లక్షల కొలది ఆకులు పందిళ్ల నిండా అల్లుకుపోయిన తములపాకు తోటల్లో చల్లగా వీస్తున్న గాలుల మధ్య ఎవళ్లదో చేయిపట్టుకుని మెడలు నిక్కించి చెవులు రిక్కించి నేను నడుస్తూ ఉండడమూ — కొండమీది దేవాలయం దగ్గిరికి వెళ్ళే మెట్లమీద, పరికిణి జాకట్టూ కట్టుకున్న ఒక అమ్మాయి నన్నెత్తుకుని నిలబడి కొద్ది దూరంలో ఉన్న జామచెట్టుమీద వాలిన ఎరువురంగు ముక్కుల ఆకుపచ్చ చిలకల్ని చూపెడుతూ నా నోట్లో గోరుగోరు ముద్దలు పెట్టడమూ — ఇలాటివి. ఇందులో మొదటి దృశ్యం గుంటూరులో, రెండోది ఎల్లమందలో, మూడోది భద్రాచలంలోనని మా అమ్మ సాయంవల్ల తెలిసింది. స్మృతుల పెట్టెలో అట్ట అడుగున కనిపిస్తున్నవి ఈ ఎరువు ముక్కుల ఆకుపచ్చ చిలకలే! కాని ఈ ముప్ఫై ఏళ్ల దూరంలో నిలబడి చూస్తున్న నా మనో నేత్రాల కవి ఏదో ఊలుతో కట్టిన పటంలోని చిలకలలాగే ఉన్నాయి కాని ఇంకే భావాలూ రావటం లేదు మనస్సును కదిలిస్తూ. అసలు మనస్సును కలుక్కుమనిపించే అనుభవాలను జ్ఞప్తికి తెచ్చేవానిలో మొదటివి కాగితం పడవలు.

నెల్లూరు — నెల్లూరు అనగానే స్మృతి తగిలేవి, పెద్ద పెద్ద ఇసుకతిప్పలూ, నీటిమీదికి బాగా వ్రాలిన వంకర - టింకర కొమ్మల పెద్దచెట్లూ, సూర్య రశ్మిలో తళతళమెరిసే అభ్రకంరేకు పొరల ముక్క ముక్కలూ, మేడమీదికి వెళుతున్నట్లుగా మెట్లెక్కి వెళితే వచ్చే రైల్వే ప్లాట్‌ఫారమూ, ఏదో స్కూలుదో కాలేజీదో అయిఉండాలి, అప్పటి నా చిన్నికాళ్ల ఎంత నడిచినా తరగని ఆటల మైదానపు ప్రహరీగోడా, వేపచెట్లూ, సీమచింతచెట్లూ, కాగితంపడవలూ.

జీవరత్నం — ఎక్కడుందో ఆవిడ, ఇప్పుడు డెబ్భై ఏళ్లు దాటాయేమో! లేక అసలు ఈ లోకం నుంచి . . . ఉహూ — ఇంకా ఎక్కడో ఉండేఉండాలి ఆవిడ. ఆవిడ గొంతు వినబడుతూంది నాకు: "చూడు సుబ్బూ! తెల్లని మబ్బులు కనిపిస్తున్నాయా, ఆ వెనకాల పెద్దతోట ఉంది. అక్కడ నీలాటి వాళ్ళే ఎంతమందో పిల్లలున్నారు. వాళ్లకు రంగు రంగు కాగితాల పడవలు చెయ్యడం 'నేర్పిస్తూంది జిన్నా ఇప్పుడు."

సరోజిని! ఆవిడని మొదట జీవరత్నం ఇంట్లోనే

**పసి వయస్సులో చేసుకున్న కాగితం పడవలు, జీవితంలో కట్టుకున్న గాలిమేడలతో సమానం. కాగితం పడవమీద ప్రయాణంచేస్తూ మహా సముద్రాన్ని యీదాలని ప్రయత్నిస్తాం కానీ సాధ్యమా! గత కాలంలోకో, గత జన్మలోకో అనుభవాల పడవలపై ప్రయాణించి, దరిచేరాలనుకోవడం ఒక అనుభూతిగా మాత్రమే మిగులుతుంది.**

చూశాను. నా స్మృతి పేటికలో ఉన్న అందమైన మొగాల బొమ్మల వరసలో మొదటిది జానకమ్మత్తదీ, రెండోది సరోజినిది. అంత చిన్నతనంలోనే భర్తను పోగొట్టుకుని, ముగ్గురు పిల్లలతో మా మేనమామ — ఆవిడకి మరిది — ఇంటి పంచను చేరిన జానకమ్మత్తను చూస్తే ఎందుకో జాలివేసేది నాకు, కారణం బోధపడకపోయినా, ఆ రోజుల్లో.

సరోజిని — జిన్ని — మొహం చూస్తేమటుకు మనస్సు గంతులువేసేది.

సరోజిని — అంతపొడుగూ, పొట్టీకాకుండా, కొద్దిగా లావుగా ఉన్నఒళ్లూ, గుండ్రని మొహమూ, కాటుకపెట్టుకున్న పెద్ద కళ్లూ, వంకలు వంకలుగా నుదుటిమీద చిందులాడే జుట్టూ, బర్మాముడీ, పొడుగుపాటి దోసగింజలా ఉన్న లోలాకులూ, రంగు రంగుల గుడ్డగొడుగూ — "జీవూ" అంటూ లోపలికి వచ్చిందావిడ. నేనప్పుడు ఒకమూల చిన్న బల్లమీద కూర్చుని వెన్న నంచుకుని రొట్టెముక్క ఒకటి తింటున్నాను. జీవరత్నం నీళ్ల గదిలో ఉంది.

అంతకుముందు ఎప్పుడో ఒకనాటి సాయంత్రం వేపచెట్టుమీద ఎక్కడ కూర్చుందో తెలియకుండా దాగుకుని అరుస్తున్న ఏదో పిట్టగొంతు తమాషాగా వినిపించి చాలాసేపు దానికోసం వెదికాను. అదిమటుకు కనిపించలేదు. "జీవూ" అని పిలిచి ఆవిడ గొంతు వినిపించగానే ఆ పిట్టగొంతు జ్ఞాపకం వచ్చి అటువైపు చూసేను. వేపచెట్టుమీది పిట్ట ఇంట్లోకే వచ్చేసిందే అని! చూడగా ఆమె మొహం, ఆవిడకళ్లూ నామీద వ్రాలాయి. గొడుగు గోడను ఆనించి ఒక రెండడుగులు లోపలికి వచ్చి నా వైపేచూస్తూ కొన్ని క్షణాలు నిలబడింది, రెప్పవాల్చకుండా. నేనూ ఏమీ అనలేదు. ఆవిడవైపే చూస్తూ కూర్చున్నాను. ఇంతలో తువ్వాలు లొడలదగ్గరనుండి భుజంవరకూ చుట్టిపెట్టుకున్న జీవరత్నం తల దులుపుకుంటూ వెనుక వరండాలోనించి గదిలోకి వచ్చింది. నా కళ్లు వచ్చిన వ్యక్తినుండి జీవరత్నం నల్లని, సన్నని, ఎముకలుకనిపించే ఒంటిమీద వ్రాలాయి. మళ్లీ వచ్చినావిడవైపేచూశాను ఎంతతెల్లగా బొద్దుగా, నిండుగా ఉంది ఆవిడ! మల్లె పూవులా, వెన్నముద్దలా!

"రా జిన్నీ. కూర్చో. ఇప్పుడే వస్తానుండు బట్ట

బి. సుబ్బలక్ష్మి

కట్టుకుని."

పక్కనున్న పడకగదిలోకి వెళ్లబోతూ ఒక్కసారి జుట్టు దులుపుకుంది గట్టిగా జీవరత్నం. కుంకుడుగింజ ముక్క ఒకటి వచ్చి నా భుజానికి తగిలి బల్లమీద పడింది. "అబ్బా!" అన్నాను. ఎడంచేతితో భుజం తడుముకుంటూ. సరోజిని నా వైపుచూసి అడిగింది: "ఈ పిల్ల ఎవరు?"

నా కెందుకో సిగ్గుగా అనిపించింది. ఒక్క చిన్న లాగు తప్ప మరింకే బట్టలూ లేవు నా ఒంటిమీద. తలవంచుకుని రొట్టెముక్క నోట్లో కుక్కుకున్నాను.

"ఈ డాక్టర్ శ్రీమంతరావుగారి మేనకోడలు. వాళ్లింటి కిందాకా ఇంజక్షన్ ఇవ్వడానికి వెళ్లినప్పుడు ఇది ఎందుకో ఏడుస్తూంటే ఎత్తుకు తీసుకువచ్చి కూర్చోబెట్టానిక్కడ. చాలా మిశ్చివస్ గరల్! వస్తానుండు, కూర్చో, జిన్నీ!'

పడకగదిలోపలికి వెళ్లి తలుపులు బిగించుకుంది జీవరత్నం. ఆవిడ, సరోజిని — నేను కూర్చున్న బల్ల దగ్గిరికివచ్చి, వంగి, మోచేతులు ఆ బల్లమీద ఆనించి, నా భుజాలు వదులుగా పట్టుకుని నా మొహం లోనికి చూస్తూ చిరునవ్వుతో అడిగింది: "ఎంత ముద్దువస్తున్నావు! నీపేరేమిటమ్మాయి?"

మాట్లాడకుండా ఆవిడ కళ్లలోనికి చూశాను తిన్నగా. మల్లెపూల వాసనలా ఏదో వాసన నన్నాక్రమించుకుంది. ఒక నక్షత్రం రాత్రి చీకట్లో మనల్ని చూసినట్లుగా చూసి నా మొహం దగ్గిరికి లాక్కుని నా బుగ్గలమీద గట్టిగా ముద్దుపెట్టుకుని అంది ఆవిడ: "భయంలేదు. నీ పేరేమిటి? చెప్పుతల్లీ!"

నెమ్మదిగా అన్నాను: "సుబ్బలక్ష్మి"

"లక్ష్మి?" మళ్లీ ముద్దుపెట్టుకుంది ఆవిడ నన్ను. నా పెదవుల కున్న వెన్న ఆవిడ బుగ్గకు అంటుకుంది గాని ఆవిడ అది గమనించనేలేదు. "పేరుకు తగినట్టే నిండుగా ఉన్నావు. ఇంత తెలుపూ, నున్నితమూ ఎలా వచ్చాయి నీకు?" నవ్వుతూ నా తల నిమిరింది ఆవిడ.

"జీవరత్నం నలుపు — నువ్వు తెలుపు!"

నా ఈ మాటలు విని కిలకిల నవ్వింది ఆవిడ: "అమ్మో! గడుసుదానివేనే!" కొద్దిగా గొంతుహెచ్చించి జీవరత్నానికి వినిపించేలా అంది: "విన్నావా! జిన్నీ, నువ్వు నలుపుట! మీ లక్ష్మి చెప్పుతూంది!"

ఆవిడ లక్ష్మిఅంటే సరదాగా అనిపించింది. అందరూ "సుబ్బలక్ష్మి" అంటే ఏదో సబ్బుసబ్బుగా అనిపించేది నాకు. ఎందుకిలాటిపేరు పెట్టారని మా అమ్మమీద విసుక్కునేదాన్ని నేను.

లోపలినుండి జీవరత్నం అంది: "దాన్ని అప్పుడే బుట్టలో వేసుకున్నావూ?"

నా నోట్లో ఉన్న రొట్టెముక్క తీసుకుని వెన్నలో ముంచి నా నోట్లో పెడుతూ అంది ఆవిడ: "ఎందుకేడ్చావుట మీ ఇంట్లో ఇందాక?"

ఆవిడ అడిగిందానికి సమాధానమివ్వకుండా ఎదురు ప్రశ్న వేశాను నేను: "నీ పేరేమిటి?"

నవ్వి అంది ఆవిడ: "జిన్నీ. జిన్ని బావుందా? జీవు బావుందా?"

ఒక్కక్షణం ఆలోచించి, ఒత్తు అక్షరాలులేకుండా సాఫీగా ఉన్న జీవే ఎంచుకుని అన్నాను: "జీవే!" ఆవిడ రెండో చేతితో నా బుగ్గ గిల్లింది: " నా పేరు బావు

లేదూ? పోనీ రోజీ అనిపిలు!"

"ఉహూ! జిన్నీ!" రోజీకన్నా జిన్నీ అంటేనే బాగుంటుంది అనిపించింది. రోజీ అన్నపేరు పొడువుగా సన్నగా ఉన్నవాళ్ళకే నప్పుతుంది. పసుపురంగుమీద పెద్దపెద్ద గులాబీపూలు ఉన్న సిల్కు చీరకట్టుకుని, కుచ్చెళ్ళు సరుదుకుంటూ పైకి వచ్చిన జీవరత్నం మమ్మల్ను చూసి అంది: "దీని తిండి కాలేదూ ఇంకా?"

రొట్టెముక్క నములుతూన్న నేను మాట్లాడ కుండా కోపంగా మూతిపెట్టాను. జీవరత్నం గోడకున్న అద్దందగ్గిర నిలబడి తలలో పిన్నులు పెట్టుకుం టున్నది. అద్దంలో కనిపిస్తున్న ఆమె మొహంమీద తెల్లగా పొరలా ఉన్న పౌడర్ చూసి అన్నాను నేను: "బూడిద రాసినట్లుంది!"

అద్దంలోని ప్రతిబింబం పెదవులు బిగించి ఉరిమి చూసింది నన్ను. బుగ్గలలో నవ్వులు కదలాడుతూనే ఉన్నాయి.

"వయస్సు వచ్చాక సినిమా స్టార్లని మించిపోతావు నువ్వు!"

సరోజిని నవ్వి అంది: "సినిమాస్టార్లకన్నా లక్ష్మి ఎంతో బావుంది!" నా కెంతో గర్వంగా అనిపించింది. జీవరత్నం మొలలో దోపుకున్న రుమాలుతీసి మొహం తుడుచుకుంది. ఆ తరవాత వాళ్ళిద్దరూ కూర్చుని ఏదో మాట్లాడుకున్నారు. ఏమిటో అప్పుడు బోధ పడలేదు ఇప్పుడు జ్ఞాపకమూలేదు. సరోజిని ఎందుకో మధ్యలో ఒకసారి మొహం ముడుచుకోవడమూ, మరో సారి కళ్ళవెంట నీళ్ళు కార్చడమూ మటుకు జ్ఞాపకం ఉంది. నన్ను తీసుకెళ్ళి మా ఇంటిదగ్గిర దిగబెట్టి వాళ్ళు వెళ్ళిపోయారు.

* * *

ఆవేళ ఎందుకేద్వాబో ఇప్పటికీ బాగా జ్ఞాపకం ఉంది. జానకమ్మత్త తన పెద్దకూతురు ఆనందమయికి చిన్న గులాబీరంగు లాగు తొడిగి పూలుపూల సిల్కు గౌనువేసి, ఘుమఘుమలాడే వాసనమూనె రాసి రెండు జడలు వేస్తున్నది. అక్కడ గుమ్మందగ్గిర నోటిలో వేలువేసుకుని దినమొలతో నిలబడ్డనాకు దాన్నిచూస్తే ఎంతో బావుంది అనిపించింది. అవతల వసారాలో కందిపప్పు రుబ్బుతున్న మా అమ్మ దగ్గిరికి వెళ్ళి అడి గాను, నాకూ సిల్కుగౌను, పూలపూలది, ఇమ్మని. ముందు మాట్లాడలేదు అమ్మ. రెండుమూడుసార్లు నేను నసుగుతూ గునిశాక, విసుగుకుంటూ లేచి చెయ్యి కడుక్కుని వచ్చి, పుస్తెల తాడుకు ఎర్రదారంతో కట్టుకున్న తాళంచెవితో మా నల్లపెట్టె తెరిచి మామూలు గౌను ఒకటి తీసి ఇచ్చింది.

"ఇది వద్దు. సిలుకుది, పూలపూలది కావాలి!" ఆ లాగు విసిరి పెట్లో పారేస్తూ గునిశాను నేను.

"సిల్కుది ఎక్కడి నుంచి తెమ్మన్నావు? ఇది బాగానే ఉంది వేసుకో!"

"ఉహూ! నాకొద్దు . . . ఊ . . . ఊ . . ."

ఏడుపుకి లంఘించుకున్నాను నేను. పాతచీరలో పైట అంచు చింపి చేతికుట్టుకుట్టిన ఆ నూలు గౌను నా కళ్ళకు ఎంతమాత్రమూ బాగులేదు. "ఏడు అయితే నీకర్మ!" అంటూ ఇంకా ఏమిటో అస్పష్టంగా గొణుగుకుంటూ మా అమ్మ వసారా మీదికి వెళ్ళిపోయింది. మా అమ్మమీద కోపం వచ్చింది నాకప్పుడు. ఇప్పుడు అది ఆలోచించుకుంటూ ఉంటే నామీదే నాకు కోపం వస్తున్నది. నాన్నగారి సంపాదనతో రోజులు గడవక నాలుగేళ్ళ నన్ను చంకను వేసుకుని తమ్ముడింటి పంచనుచేరిన ఆవిడని ఎందుకలా బాధ పెట్టేదాన్నా అని! ఆనందం చింపిపారేసిన పేర్ల పుస్తకాలలో కాగితాలన్నీ మళ్ళీ జాగ్రత్తగా అంటించి నాచేత చదివించేది ఆవిడ. ఇంటివెనక ప్రహరీగోడ బాగుచెయ్యడానికి తెచ్చిన ఇసుక కుప్పలో ఓనమాలు దిద్దించేది ఆవిడ. ఏదో నా మీద ఆశపాశం ఆవిడకి! అలాటి ఆవిడ మనసు ఎందుకలా మరింతగా బాధ పెట్టేదాన్నో!

అక్కడే చతికిలపడి ఏడుస్తూ కూర్చున్నాను చాలా సేపు. అమ్మమ్మా, నాగమ్మత్తా మా మామయ్య భార్య జానకమ్మత్తా అందరూ అటూ ఇటూ తిరుగు తున్నారు గాని ఎవళ్ళూ నా సంగతే పట్టించుకోలేదు. అమ్మమ్మకు ఏదో ఇంజక్షన్ ఇవ్వడానికి వచ్చిన నర్సు జీవరత్నం సిరెంజ్ కడుగుతూ, ఏడుస్తున్న నన్ను చూసింది. జాలివేసింది కాబోలు తన సంచీ సర్దు కున్నాక నా దగ్గిరికి వచ్చి కూర్చుని నన్ను సముదా యించి లాలించి లాగు తొడిగి వాళ్ళింటికి తీసుకు పోయింది. అటునుంచి వచ్చాక ఎందుకో గర్వంగా అనిపించింది నాకు. జానకమ్మత్తకన్నా కూడా అందంగా ఉన్న జిన్నీ నన్ను ముద్దుపెట్టుకుని నాచేత రొట్టె తినిపించింది. ఆనందానికి ఆ అదృష్టంలేదు. గులాబీరంగు లాగూ, 'పూలపూల సిల్కు గౌనూ వేసుకున్నంతమాత్రాన లాభమేమిటి?' పాతచీరచింపి కుట్టిన నానూలు గౌనే ఎంతో బాగుంటుంది అని పించింది.

జిన్నీ! మల్లెపూల వాసనలు జిమ్మే పెదవులతో నన్ను ముద్దుపెట్టుకున్న దేవలోక సుందరి జిన్నీని ఎప్పుడూ మరిచిపోలేను నేను!

* * *

కొన్నాళ్ళు గడిచిపోయాయి. ఎన్నాళ్ళో ఇప్పుడు లెక్కచెప్పలేను. "క" గుణింతం పూర్తిగా వచ్చేసింది నాకు. "కాకి" "కేక" "కైక" లాటి పేర్లు రాయడం చదవడం వచ్చేసిందన్న హుషారులో ఒక రోజు మా అమ్మ వద్దన్న పనుల్లో ఒకటి చేశాను.

పొద్దున్న మా అమ్మ ఇచ్చిన అరగ్లాసు కాఫీ అరిగి పోవడాన్ని కడుపులో ఆకలిగా ఉంది. వంటఇంటివైపు వెళ్ళాను. ఇంకా పొయ్యి భగభగ మండుతూనే ఉంది, పైన ఉత్తవిసరుపీళ్ళు మరిగిస్తూ అమ్మమ్మ కూరలు తరుగుతూంది. ఇంకా చాలాసేపు ఉండాలన్నమాట కంచంలోకి అన్నం రావడానికి. ఏమీతోచక వెనకకు వస్తూ వస్తూ నాకు "ప్రవేశం నిషేధం" అయిన మా మేనమామ గదిలో అడుగుపెట్టాను అక్కడేమన్నా పళ్ళుగాని ఉంటే పట్టుకుపోయి తిందామని.

సుందరం అక్కడ కుర్చీమీద కూర్చుని వాళ్ళ నాన్న స్టెతస్కోపు — అప్పటికి దానిపేరుగాని ఉపయోగం గాని నాకు తెలియదు, రబ్బరుగొట్టాం అని మటుకే తెలుసును రెండు చెవుల్లో పెట్టుకుని ఆ తెల్లనిబిళ్ళని ఒక పెద్ద పుస్తకంమీద పెట్టి దాని గుండెకాబోలు పరీక్షిస్తున్నాడు తీవ్రంగా. వాడు పెదవులు విరవడం చూస్తే పరీక్ష ఏమీ సంతృప్తికరంగా లేదని తెలు స్తూంది. నన్ను చూడగానే "రా మణీ — నీ గుండెలు చూడాలి!" అన్నాడు. వాడు నాకన్నా మూడేళ్ళు పెద్ద. వాడిమాట వినకపోతే తంతాడు. అందుకని భయంగా వెళ్ళి కుర్చీకానుకుని నిలబడ్డాను. గౌనూ ఏమీలేకుండా ఉన్న నా గుండెలమీద ఆ బిళ్ళని పెట్టి ఒక అర నిమిషం జాగ్రత్తగా విని మళ్ళీ పెదవి విరిచాడు వాడు. నాకు కితకితలు వేస్తున్నాయి. భయంగా కూడా ఉంది. వాడు లేచి నిలబడి మామయ్య మంచంచూపిస్తూ "పడుక్కో" అన్నాడు. మంత్రం వేసినట్లుగా వెళ్ళి ఆ మంచంమీద పడుక్కున్నాను, నావీపూ, కాళ్ళూ, మట్టిమయం అన్నసంగతి మరిచిపోయి.

సుంధరం స్టెతస్కోపుతో నా గుండెలు పరీక్షించి ఆ తరవాత కడుపుమీద ఆ బిళ్ళపెట్టి "లాగు కొద్దిగా కిందికి లాగు" అన్నాడు. మాట్లాడకుండా భయంతో వాడు చెప్పినట్లుగానే చేశాను. మరీ ఎక్కు వగా కితకితలు వేస్తున్నాయి నాకు. ఇంక లేచి పారి పోదాం అనుకుంటుండగా మా మేనమామ ఆ గదిలోకి



విగ్రహం

ఫోటో—కె. వి. రావు (మద్రాస్—54)

వచ్చాడు. సుందరం చల్లగా జారిపోయాడు, స్టెత స్కోపు మంచంమీద పడేసి. నేను మంచం దిగు తూండగా ఆయన నా చెవులూ, కుడితొడా గట్టిగా మలిపి ఏదో తిట్టాడు. లోపల లోపలే ఏడుస్తూ పైకి వచ్చిన నేను వెళ్ళి వీధివైపు అరుగుమీద కూర్చున్నాను కొంతసేపు. చెవులూ, తొడా మండుతున్నాయి. బాగా ఆకలిగా కూడా ఉంది. జీవరత్నం ఇంటికి వెళితే బాగుం డును అనిపించి లేచి అటువైపు వెళ్ళాను.

వీధిగుమ్మం తలుపులుదగ్గిరగా వేసిఉన్నాయి. వచ్చేసి ఉంటుంది జీవు అనుకుంటూ తలుపులు తోశాను. లోపల కుర్చీలో కూర్చుని ఉంది సరోజిని. బల్లమీద మొహం ఆనించుకొని పడుకుని ఉంది ఏడుస్తూ. తలుపు చప్పుడు విని తలపైకెత్తి నన్ను చూసినట్లుగా అనిపించింది ఆవిడ నా వైపు చూస్తూ ఉంటే. ఆవిడ కళ్ళనిండా నీళ్ళున్నాయి. "నువ్వా!" అంది

ఆవిడ. నేను జంకుతూ లోపలికి వెళ్లి కొద్దిదూరంలో నిలబడి ఆవిడ మొహంవైపు వింతగా చూశాను. 'జిన్నీలా అంత అందంగా మొహం ఉన్నవాళ్ళు కూడా ఏడుస్తా రెందుకు చెప్మా? అమ్మ ఏడ్చిందంటే అర్థం ఉంది గానీ!' అనుకున్నాను మనసులో. చాలాసేపు నంగా నావైపు చూసి చివరికి హఠాత్తుగా ముందుకు వంగి నన్ను దగ్గిరికి లాక్కుని నా బుగ్గలమీద తన బుగ్గలు ఆనించి ఏడవడం మొదలెట్టింది ఆమె. నాకూ బాధగా అనిపించింది. ఎందుకో ఇంతలో జీవరత్నం వచ్చింది. మమ్మల్ని చూసి "ఇదేమిటే జిన్నీ!" అంది. నన్ను వదలి బల్లమీద చేతులుచాపి మొహం ఆ మధ్యను దాచుకుని వెక్కివెక్కి ఏడవడం మొదలుపెట్టింది జిన్నీ జవాబివ్వకుండా.

"బావుంది. ఏమిటది జిన్నీ, చంటిపిల్లలా? ఛీ, ఊరుకో." అంటూ గొడుగు గోడకి తగిలించి వచ్చి జిన్నీ మొహం పైకెత్తి ఆ కళ్ల నీళ్ళు తుడిచింది జీవరత్నం.

వెక్కివెక్కి ఏడుస్తూనే అంది జిన్నీ: "ఇంతే ఉంటాడిప్పుడు సరిగా! ఆడపిల్లఅయినా దీన్నిచూస్తే వాణ్ణిచూసినట్లే అనిపిస్తూంది జిన్నీ! వాడున్నా నా దగ్గిరుంటే బావుండును! ఇంత ఒంటరితనం అని పించదు!"

మొహంమీద పడుతూన్న జిన్నీ ముంగురులు వెనక్కితోస్తూ అంది జీవరత్నం జాలిగా: "ఏడుస్తూ కూచుంటే వాడు నీ దగ్గిరికి వస్తాడా? చాళ్ళే! లే, వచ్చినదానివి చెప్పాలన్నా విప్పకుండా ఏమిటే ఏడుపు, వెర్రిదానిలా!" నా వైపు తిరిగి అంది ఆమె: "ఇంతవేళ వచ్చావేం సుబ్బూ? వణ్ణం తిన్నావా?"

వాళ్ల అర్థంకాని మాటలు వింటూ ఆకలిసంగతే మరిచిపోయిన నేను ఆ ప్రశ్నతో మళ్ళీ ఈ లోకంలో— అంటే చెవీ, తొడా నొప్పి కనిపించే ప్రపంచంలో — పడి మంటతో కళ్ళు నులుపుకుంటూ "మామయ్య కొట్టాడు" అని నా గోడు చెప్పుకున్నాను ఆవిడతో.

"మొగపిల్లల్ని మించిపోయి అల్లరిచేస్తూంటే మరి కొట్టరూ? ఇంతకి వణ్ణం తిన్నావా లేదా?

"లేదు."

"మా ఇంట్లో కోడిమాంసం తింటావా?" నవ్వుతూ అంది జీవరత్నం.

"ఛీ" అన్నాను నేను దీర్ఘంతీస్తూ. జిన్నీ ఇంకా వెక్కివెక్కి ఏడుస్తూనే ఉంది. జీవరత్నం జాలిగా జిన్నీ తలపైకెత్తి కళ్ళుతుడుస్తూ అన్న మాటలు అప్పుడు నా కర్థంకాలేదు కాని ఇప్పటికీ ఎందుకో మనస్సులో అలా జ్ఞాపకంగా ఉండిపోయాయి:

"ఎంత మెత్తని మనస్సు నీది జిన్నీ! లేచిపోయిన మనిషి, రాక్షసి, కొడుకు నొదిలేసి వచ్చేసింది అను కొంటారు నిన్ను తెలియనివాళ్ళు మటుకే."

ఇంతలో మా అమ్మగొంతు వినిపించింది గుమ్మంలో: "ఇక్కడా ఉందీ లంకాసుందరి! వెతకలేక నా ప్రాణాలు పోయాయి!"

జిన్నీ లేచి నిలబడింది. జీవరత్నం నవ్వుతూ అంది: "మా ఇంట్లో కోడిమాంసం తింటుందట మీ సుబ్బు ఈ వేళ విన్నారూ!"

"ఛీ" అన్నాను మళ్ళా నేను మూతి ముడిచి దీర్ఘాలుతీస్తూ:

"పెద్దయ్యాక అంతపనీ చేస్తుందమ్మా ఎలాగూ ఇది మా పరువుతీసేస్తూ! మొన్నొకనాడు మా శ్రీమంతం కోసం తెప్పించిన కోడిగుడ్డు కొట్టుకు తాగబోతూంటే చూసి చెవులు మెలేశాను." జిన్నీవైపు చూసి అడిగింది మా అమ్మ: "ఈ అమ్మాయెవరు?"

"ఈ పిల్లాండి. సరోజిని అని ఇక్కడే స్కూల్లో మిస్ట్రెస్‌గా ఉంది. అవునుగాని విన్నారూ! మీ సుబ్బులు చదువూ సంధ్యాలేకుండా తిరుగుతూంది స్కూలుకు వెళ్లకుండా. మా సరోజిని స్కూలుకి పంపకూడదూ?"

జిన్నీ మా అమ్మకు నమస్కారం పెట్టి అంది: "మా స్కూలుకు పంపండమ్మా. నేను నేర్పిస్తానన్నీ."

మా అమ్మ జిన్నీవైపు అనుమానంగా చూసి అంది: "ఏమిబళ్ళోనమ్మా! ఆ మధ్య పంతులుగారి వీధిబళ్ళో చేర్పించాను దీన్ని. అక్కడ పిల్లలకి కోదండాలు వేయి స్తున్నారట. పిల్లది చూసి బెదిరిపోయి జ్వరంపడింది."

సరోజిని నవ్వి అంది: "అటువంటి మూర్ఖపు చదువులేరు మా స్కూల్లో అమ్మగారూ. ఆటపాటలతో చదువు చెబుతాం. ఏం లక్ష్మీ? వస్తావా? ఎన్నో కాగితం పడవలు చెయ్యడం నేర్పిస్తాను నీకు? రంగురంగుల కాగితాలతో?"

"ఊఁ" అని గంగిరెద్దులా తల ఊపాను నేను.

"ఆటలంటే తయారే ఈ అయిరావణుడిచెల్లెలు!



అవునుగాని మీ ఇల్లెక్కడమ్మా?"

సరోజినీ జీవరత్నం ఒకళ్ల మొహాలొకళ్లు చూసుకున్నారు. సరోజిని ఏదో మింగినట్లుగా ఒకసారి గుటక వేసింది. సరుదుకుని జీవరత్నం అంది: "చర్చిదగ్గిరండి. వాళ్లాయన ఊరికివెళ్లారు అందుకని నిన్నటినుంచి మా ఇంట్లోనే ఉంటున్నది."

"అయితే మరి స్కూలు దగ్గిరేనా?" అని అడిగింది మా అమ్మ.

"దగ్గిరేనండి. రేపటినుంచీ నాతోపాటు తీసుకు వెళతాను లక్ష్మిని."

"నీ కడుపున పుడతానుతల్లీ. ఏదో కొంత చదువుకుంటే ఈ పెళ్లి పేరంటాల బాధలేకుండా తన బ్రతుకు తాను గడుపుకుంటుంది పెద్దదై!" అంటూ నా వైపు తిరిగి అంది అమ్మ: "పద . ."

* * *

ఈ నడివయస్సులోనూ మా పిల్లలకు కాగితం పడవలు చేసిపెడుతున్నప్పుడు పరధ్యాన్నంగా అయిపోతాను నేను అప్పుడప్పుడు. కాగితం మడతలు పెడుతున్నప్పుడల్లా మిషన్‌స్కూల్లో ఆ మొదటి రోజు దృశ్యం నా కళ్లముందు మెదిలి నన్ను గతంలోకి లాక్కుని వెళ్లిపోతుంది. మా పిల్లలందరూ ఎప్పుడో ఒకప్పుడు: "ఏమిటమ్మా, అలా ఆగిపోయావు? మరిచిపోయావా ఎలా మడతపెట్టడమో?" అని అడిగినవాళ్లే. ఆ ప్రశ్నతో మళ్లీ ఈ లోకంలో పడతాను నేను.

జిప్సీ చేయిపట్టుకుని నడుస్తోంది ఆ పిల్ల ఆవేళ. మంచి గౌనుకూడా వేసుకుంది. తల చక్కగా దువ్వుకుని రెండు జడలు వేసుకుంది. ఆ ఒంట్లోంచి మల్లెపూల వాసనలు పైకిలేస్తున్నాయి — జిప్సీ చిన్న నలుపలకల సీసాతో ఏదో మీదని జల్లి మంత్రం వెయ్యడంవల్ల! దానికాలివేళ్లూ చేతివేళ్లూ శుభ్రంగా ఉన్నాయి, మట్టి నిండిన గోళ్లన్నీ జిప్సీ చిన్న నెయిల్ కట్టర్‌తో తీసి వెయ్యడం వల్ల.

ఇనప ఊచల స్కూలు గేటుదాటగానే తిన్నగా లోపలికి వెళుతూన్న దారికి రెండు పక్కలా రకరకాల క్రోటన్సుమొక్కలూ పూలూ ఉన్నాయి. చక్కనిమెట్లూ, గుండ్రని స్తంభాలూ, ఎత్తు అరుగులూ — గచ్చకాయరంగులో కనిపిస్తున్న పిట్టగోడల డాబా ఒకటి దూరంగా కనిపిస్తోంది చెట్లమధ్య. ఆ డాబామీద ఒక చిన్న గదికూడా ఉంది. మబ్బులమీద తేలిపోతూ నందనవనంలో ఇంద్రభవనం చేరుకునే దారిలో నడుస్తున్న ఆ పసిపాప జీవితంలో — నా జీవితంలో — అదొక జిగజిగమనే మెరుపు! ఒక మధుర స్మృతి అది!

ఆ వేళ బుధవారం. ఆఖరు పీరియడ్ చేతిపనుల పీరియడ్ అట. పైన డాబామీది గదిలో చేరాం పిల్లలందరమూ. సరోజిని అక్కడ ఒక అల్మైరా తెరిచి అందులోనించి గులాబీరంగు, లేత ఆకుపచ్చ రంగూ, మబ్బురంగూ దళసరి కాగితాలు పైకితీసి అందరికీ పంచిపెట్టింది. "అమృతమంథన్" సినిమాలో జగన్మోహిని అమృతం పంచినట్లుగా. ఎక్కడున్నావు జిప్సీ నువ్విప్పుడు?

అనుభవం ఉన్న పిల్లలు కాగితాలు సరిగ్గాచింపి పడవలు చేసెయ్యడం మొదలుపెట్టారు. అనుభవంలేని నాలాటి వాళ్లకు ఒక్కొక్కళ్లకీ స్వయంగా కాగితం కోసుగా మడిచి ఎలా చింపాలో, మొదటి మడతలు



అన్నెం పున్నెం ఎరుగని అవయసు — ఫోటో—ఆర్. టి. ఎస్. మణి (తిరుచ్చి-2)

ఎలా పెట్టాలో చక్కగా నేర్పించింది సరోజిని. పిల్లి మడతలు పెడుతూండగా పెద్ద పిల్లలకు విమానాలు చేయడం నేర్పిందావిడ. ఒకటి రెండుసార్లు బోర్డుమీద బొమ్మలుగీసి చూపించింది నేర్పుగా.

సన్నగా ఉన్న ఆ గది చాలా క్రిందికిఉంది, సరోజిని తలకు ఇంచుమించుగా తగులుతున్నట్లుగా. నాలుగు వైపులా గోడలకు పెద్ద పెద్ద గాజుటద్దాలకిటికీలున్నాయి. ఒక కిటికీలోనించిచక్కని దృశ్యం కనిపిస్తోంది — గాలిలో ఊగుతూన్న కొబ్బరి చెట్లతలలూ, ఆ వెనక ఆకాశంలో తేలిపోతూన్న తెల్లని దూదికుప్పలాటి మబ్బులూ!

ఈ మధ్య ఒకసారి మా వారితో రోమన్ కాథలిక్ మిషన్ వాళ్ల చర్చికి ఒక ఆదివారం వెళ్లినప్పుడు అక్కడ ఒక నల్లని కోలమొహం అమ్మాయి కోరస్ లీడ్‌చేస్తూ పాడిన పాట విన్నప్పుడు ఎప్పుడో విన్నట్లనిపించింది ఆ వరస. ఆ రాత్రి హఠాత్తుగా జ్ఞాపకం వచ్చింది — చిన్నతనంలో మిషన్‌స్కూల్‌నుంచి మొదటి రోజున తిరిగి వస్తున్నప్పుడు నా చెయ్యి పట్టుకుని ఊపుతూ నడుస్తున్న సరోజిని హమ్మింగ్ చేసిన వరస అదేఅవి! మళ్లీ వింటే బాగుండును ఆ పాట! ముక్కలేవో ఏమీ జ్ఞాపకంలేదు. బహుశా పాపాలు చేసిన మానవుడు తనకోసం సిలువమీద మేకులతో బిగించబడిన ప్రభువు దేహం పడే బాధలు తనవే అనుకుని ఆ పశ్చాత్తాప హృదయంలో అనుకునే మాటలు కాబోలవి!

ఆస్పత్రి కాంపౌండ్ అంతదూరంలో ఉండగా హఠాత్తుగా వెనకవైపునుంచి వినవచ్చిన "ష్రొ...జిప్సీ" అన్న ముద్దమాటల పిలుపుతో ఉలికిపడి హమ్మింగ్ ఆపి వెనకకు తిరిగిచూసింది జిప్సీ. పెదవులు బిగించి అంది:

"నువ్వా!"

"అవును నేనే! ఇల్లక్కర్లేదా నీకు?" ఆ వయస్సులో నాకు తెలియదు. తప్పతాగిన వాడి గొంతు అలా అవుతుందని. వింటూంటే భయంగా అనిపించింది. ఆ మనిషివైపు పరీక్షగాచూశాను అంత భయంలోనూ. పెద్దక్రాపూ, పై పెదవిని సగంవరకు కప్పివేస్తున్న బొద్దుమీసాలూ, ఎర్రగా చింతనిప్పుల్లా ఉన్నకళ్లూ, గుండెలమీద నల్లగా ఎలుగుబంటిలా వెంట్రుకలు కనిపించేలా గుండీలు ఊడిపోయి ఉన్న పంజాబీచొక్కా, వదులైన గళ్లగళ్ల షరాయి, — లావుగా, నల్లగా అంత ఎత్తుగా ఉన్నాడామనిషి. నా గుండెలు బాగా దడదడకొట్టుకున్నాయి. సరోజిని మౌనంగా అతని వైపు చూసింది. ఆమె కళ్లల్లో కదలాడినభావం పదేళ్ల తరవాత ద్రౌపదీ వస్త్రాపహరణం సినిమాలో దుశ్శాసనుడు నిండుసభలో తన ఒంటిమీద చీర లాగుతున్నప్పుడు ద్రౌపది వేషం వేసిన కన్నాంబ కళ్ళు చూసినప్పుడు పూర్తిగా బోధపడింది.

"పద ఇంటికి ... వంట ఎవడు చేస్తాడనుకున్నావు నీ మొగుడు?"

అంతకంతకు మాకు దగ్గిరవుతున్నాడు ఆ దుశ్శాసనుడు తూలిపోతూ.

"నీకు తిండెందుకు తాగుడుంటే? నేను రాను. ఫో! "హఠాత్తుగా నా చెయ్యిపట్టుకుని తండ్రుకుని పరిగెత్తింది సరోజిని ఆస్పత్రిగేటు దగ్గరికి. నే నొకసారి భయంగా వెనకకు తిరిగిచూశాను. ఏదోరాయి తగిలి కింద పడ్డాడు కాబోలు, మళ్లీ లేస్తున్నాడు వాడు: "ఆగు . . ఆగు . ." అంటూ.

ఒక్క ఊపున కాంపౌండ్ లోపలికి దూసుకునివెళ్లి

నన్ను వేపచెట్టుదగ్గిర వదలిపెట్టి "ఇంటికి వెళ్లిపో" అంటూ తాను జీవరత్నం ఇంటివైపు వెళ్లిపోయింది సరోజిని. నేను ఆస్పత్రిగేటువైపు చూశాను. అక్కడ గూర్ఖావాడితో ఏదో వాదిస్తున్నాడు ఆ తాగుబోతు. గట్టిగా కళ్ళుమూసుకుని ఇంటివైపు పరిగెత్తానునేను.

* * *

ఆ రాత్రి వచ్చిన భయంకరమైన కలలో జరిగినవన్నీ జ్ఞాపకంలేవు కానీ ఏదో పెద్ద సముద్రంలో నేనూ సరోజినీ నిలబడి ఉన్న పెద్ద కాగితం పడవ భగభగ మండుతూ కాలిపోవడం మటుకు కాగితం పడవలు చేస్తున్నప్పుడల్లా నాకు జ్ఞాపకం వస్తూనే ఉంటుంది. ఆ కలలో జిన్నీ ఎలా మాయమైందో తెలియదుగాని నేనుమటుకు మండుతున్న కాగితం పడవమీద అటూ ఇటూ పరిగెడుతూ "జిన్నీ! జిన్నీ!" అని అరుస్తున్నాను. ఆకాశంమీదినించి పెద్దరాయి ఎగిరివచ్చి నా తలకి తగిలింది. "అమ్మో" అంటూ మేలుకున్నాను. మంచం కోటిమీద తల వడేసుకుని ఏడుస్తూ బొంతమీద అమ్మకోసం తడుములాడాను. అమ్మలేదు. భయంతో వణికిపోతూ లేచి కూర్చున్నాను. హెచ్చించిన లాంతరు చేతిలో పట్టుకుని గడప కవతల నిలబడిఉంది అమ్మ. చేతిలో సంచీ పట్టుకున్న మామయ్య గడపదాటుతూ కనిపించాడు. ఆయన అంటున్నాడు: "తలుపు గడియ పెట్టేసెయ్ అక్కా!" మామయ్య వెళ్లాక అమ్మ తలుపు గడియపెట్టి, లాంతరు తగ్గించి ముక్కాలిపీట మీద పెట్టి నా దగ్గిరికి వచ్చి "ఎందుకలా అరుస్తావు? వెధవ కలవరింతలూ నువ్వూ!" అంటూ నా పక్కలో పడుకుంది. మా అమ్మ వెచ్చని పొత్తి కడుపుమీద రాస్తూ అడిగాను నేను: "ఎక్కడికమ్మా వెళ్లాడు మామయ్య? ఇంతరాత్రి?"

"జి . . ." అని ఆగి "ఆస్పత్రికి" అంది అమ్మ.

"ఆస్పత్రికా? ఇప్పుడా?" అన్నాను నేను.

"ఏదో నీకెందుకు ... పడుకో ... ఎవళ్లకో ప్రమాదంగా ఉందిట!"

నిద్రకళ్లమీదికి ముంచుకు వస్తుండడాన్ని ఇంకేమీ అనకుండా ఊరుకున్నాను. బాగా నిద్రమత్తుగా అవుతున్నప్పుడు అమ్మ అంటున్నమాటలు విని మెలకువ వచ్చిందిగానీ అంతలోనే మళ్లీ నిద్రపట్టేసింది. ఆ ముక్కలుమటుకు ఇప్పటికీ జ్ఞాపకం ఉన్నాయి నాకు: "నాలుగు ముక్కలు వస్తున్నాయనుకుంటే నా కర్మ నీ కర్మా ఇలా కాలింది!"

* * *

ఆ మరునాడు ఉదయం పెరట్లో వేపచెట్టు దగ్గిర నిలబడి కచ్చికపెట్టి పళ్లు తోముకుంటున్నాను. నూతి దగ్గిర అమ్మా, నాగమ్మత్తా ఏదో మాట్లాడుతున్నారు. ముందు పరాకుగా వేపపళ్లుచూస్తూ వాళ్ల మాటలు వినలేదు. కాని మధ్యలో జీవరత్నం పేరు వినపడగానే చెవులు రిక్కించి విన్నాను. మా అమ్మ అంటున్నది: "మధ్యన ఈ జీవరత్నం ఎందుకు వాళ్లని తెచ్చి ఇంట్లో పెట్టుకుంది?"

వాళ్లిద్దరూ కలిసి చదువుకున్నారట చిన్నప్పుడు. అదీగాక దాని అసలు మొగుడూ జీవరత్నానికేదో అవుతాడట."

"అంత పెద్దకొడుకునొదలి ఎలా లేచివచ్చిందో ఇది! పోనీ వచ్చింది వీడిదగ్గిరన్నా విశ్వాసంగా ఉండకూడదూ?" బుగ్గలు నొక్కుకుంటూ అంది మా అమ్మ.

"దానికెప్పుడో ఆ మధ్య జబ్బుచేసినప్పుడు ఈ కంపౌండర్ వెళ్లేవాడట అక్కడికి ఇంజక్షన్లివ్వడానికి. అప్పటినించీ ఇద్దరికీ కలిసిందంటున్నారు."

"ఏమి కలవడమో! రెండు నిండు ప్రాణాలూ నెత్తుటి మడుగులో కలిశాయి చివరికి! ఎంత దారుణంగా పొడిచేశాడో వాడు!"

"అసలే తాగుబోతు. అంత అపేక్షగా తాను చూసినప్పుడు అక్కడినించి మళ్లీ లేచివచ్చి జీవరత్నం ఇంట్లో ఇలా వేషాలు వెయ్యడం చూసి వాడు మరి పట్టలేకపోయాడు. ఆ వరండాలో మంచంమీదినించి కిందికి దిగనివ్వకుండానే ఇద్దరినీ హతమార్చేశాడు!"

నా గుండెలు దడదడ కొట్టుకోవడం మొదలు పెట్టాయి. వాళ్ల మాటలు అప్పుడు బోధపడలేదుగాని జిన్నీని మటుకు ఆ తాగుబోతు చంపేశాడని తెలిసింది. నీళ్లతో మొహం కడుక్కోకుండానే పెరటి గుమ్మం దగ్గిరికి వెళ్లబోతున్న నన్ను చూసి మా అమ్మ అంది:

"ఎక్కడికే వెళ్లడం! డొక్కచీరేస్తాను గడప దాటితే! ముందు మొహం కడుక్కుని వెళ్లి కుంపటి పక్కని గళాసులో కాఫీ ఉంది తాగు."

వెనక్కి వచ్చి ఇంట్లోకి వెళ్లాను. కాని కాఫీ తాగబోతే లోపలికి వెళ్లలేదది. ఎవరూ చూడకుండా తూములో పారబోసి ఇంట్లోంచి చల్లగా జారిపోయి పరిగెత్తుకుని జీవరత్నం ఇంటివైపు వెళ్లాను.

> **పేదవాని కోపం ...**
>
> ఆగ్రహం చాలా ఖరీదైన విలాస వస్తువు—ఎక్కువ రాబడి ఉన్న వాళ్లే ఆగ్రహపూరితులు కావచ్చు.
>
> —జి. డబ్ల్యు. కర్టిస్

అక్కడ చాలామంది మూగిఉన్నారు. ఇద్దరు ముగ్గురు పోలీసులు అందరినీ అదమాయిస్తూ అటూ ఇటూ తిరుగుతున్నారు. అతి కష్టంమీద జీవరత్నం ఇంటి వరాండావరకూ వెళ్లగలిగాను. అరుగుమీదికి ఎక్కుదామంటే వీలుకాలేదు ఆ జనసమ్మర్దంలో. ద్వారబంధం దగ్గిర ఒక పోలీసు ఎవళ్లనీ లోపలికి పోనీయకుండా అడ్డంగా లాఠీకర్రపెట్టి నిలబడి ఉన్నాడు. ఇంకోపోలీసు అరుగుమీద ఉన్నవాళ్లను కిందికి దిగిపొమ్మని తోస్తున్నాడు. నా గుండెలు దడదడ కొట్టుకుంటున్నాయి. లోపలకి ఎలాగన్నా వెళదామని ప్రయత్నించాను కాని ఆ పెద్దవాళ్ల కాళ్ల మధ్య నలిగిపోతున్న నాకు సాధ్యంకాలేదు. వెనక్కి ముందుకూ అవుతూ, ఎక్కడన్నా జీవరత్నం మొహం కనిపిస్తుందేమోనన్న ఆశతో గుమ్మంవైపే చూపులు నిలపడానికి ప్రయత్నిస్తున్నాను. ఎంతసేపు గడిచిందో అలా తెలియదు. ఇంతలో ఎవళ్లో నా చెయ్యిపట్టుకుని అవతలకు లాగుకు వెళ్లడం మొదలుపెట్టారు. ముందు ఆ మనిషిమొహం కనబడలేదు గాని గుంపుదాటాక అది వార్డుబాయ్ సుభాన్‌ఖాన్ అని తెలిసింది. మా అమ్మ దూరంగా వేపచెట్టుదగ్గిర నిలబడి ఉంది. నన్ను సుభాన్ అక్కడికి ఈడ్చుకు వెళ్లాడు.

"హిదుగో హమ్మగారూ హమ్మాయి!"

లాగి లెంపకాయ కొట్టింది అమ్మ నన్ను: "ఆ గుంపులో నలిగి చస్తావు! పద ఇంటికి!" అంటూ జరజరా ఈడ్చుకుపోయింది నన్ను. నేను గట్టిగా ఏడుస్తూ ఆవిడ చేతులూ కాళ్లూ రక్కాను నా గోళ్లతో. ఆవిడ చేతిమండ కరుద్దామని ప్రయత్నించానుగాని వీలుకాలేదు. నా రక్కులవల్ల భౌతికంగానూ మానసికంగానూ కూడా మా అమ్మకు మండి ఉంటుంది. నన్నీడ్చుకుని వెళ్లి కర్రలకొట్లో పెట్టి పైన గొళ్లెం పెట్టింది. ఇంకేమీ చెయ్యలేక ఏడుస్తూ ఆ కర్రలన్నీ అటూ ఇటూ పారెయ్యడం మొదలుపెట్టాను. తలుపులు దబదబ బాదాను. కాని ఎవళ్లూ నా గోడు వినిపించుకోలేదు భోజనాలవేళవరకూ.

* * *

ఆ వేళ సాయంత్రం చీకటి పడుతున్నప్పుడు ఎలాగో అమ్మ కళ్లు కప్పి జీవరత్నం ఇంటికి వెళ్లాను. తలుపులు దగ్గిరికి వేసిఉన్నాయి. తోసుకుని తిన్నగా జీవరత్నం గదిలోకి వెళ్లాను. ఆమె మంచంమీద బోర్లాపడుక్కుని వెక్కివెక్కి ఏడుస్తున్నాది. నేనురావడం గమనించలేదు ఆమె. మంచం దగ్గిర నిలబడి భయపడుతూ: "జీవూ!" అన్నాను.

ఆమె తలెత్తి నన్ను చూసింది కొన్ని క్షణాలు. ఏమీ మాట్లాడలేదు. హఠాత్తుగా పక్కకు ఒత్తిగిలి చేతులు చాపి నన్ను మంచంమీదికి ఎక్కించి తన పక్కన పడుకోబెట్టుకుంది. నా జుట్టు నిమురుతూ నా కళ్లల్లోనికి చూస్తూ అంది: "జిన్నీ వెళ్లిపోయిందిసుబ్బూ!"

నాకూ ఏడుపు వచ్చింది: ఏడుస్తూనే అడిగాను: "మరి రాదు జిన్నీ?"

"కెవ్వుమని కేకపెట్టబోయినట్టుగా ఆమె పెదవులు తెరుచుకున్నాయి. అంతలో ఆపుకుని నా తల దగ్గిరకు లాగుకుని నా నుదుటిమీద తన గడ్డం ఆనించి అంది: "ఊహూ — మరి రాదు సుబ్బూ!"

"ఎంతో మంచిది జిన్నీ! కదూ జీవూ?" అన్నాను నేను ఏడుస్తూనే.

"నిప్పులాంటి మనిషి! కల్లాకపటమూ ఎరగదు! అందుకే ఇలా అయిపోయింది దాని బదుకు!" అంటూ గట్టిగా నన్ను గుండెల కదుముకుంది ఆమె.

కొంతసేపటికి ఇద్దరమూ ఏడుపుమానేసి అలా పడుకున్నాం నిశ్శబ్దంగా. చివరకు జీవరత్నం లేచి మంచం దిగి నన్ను చేయిపట్టుకుని కిటికీ దగ్గిరికి తీసుకెళ్లి అవలతల ఆకాశంమీద తేలిపోతూన్న మబ్బులు చూపించి అంది:

"చూడుసుబ్బూ! తెల్లని మబ్బులు కనిపిస్తున్నాయా, ఆ వెనకాల పెద్ద తోట ఉంది. అక్కడ నీలాటివాళ్లే ఎంతమందో పిల్లలున్నారు. వాళ్లకు రంగు రంగు కాగితాల పడవలు చేయడం నేర్పిస్తూంది జిన్నీ ఇప్పుడు!

* * *

అమ్మా అత్తా ఆవేళ అనుకున్న మాటలు అప్పుడు పూర్తిగా బోధపడకపోయినా ఆ తరవాత తెలిసింది వాటి అర్థం.

"ఎందుకో ఈ కాగితం పడవలు తయారుచేసి ఈ ప్రపంచంలో జీవిత ప్రవాహంలో వదులుతూంటారు ఇలా, ఎవరో!

★